ప్రజాశక్తి
శుక్రవారం 19 సెప్టెంబరు, 2025 5
శ్రీకాకుళం



నేటి నుంచి అక్షరాంధ్ర శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వయోజన విద్యాశాఖ ఆధ్వర్యాన జిల్లావ్యాప్తంగా అక్షరాంధ్ర (ఉల్లాస్) ఒకరోజు శిక్షణా కార్యక్రమాలను ఈనెల 19, 20వ తేదీల్లో రెండు విడతలుగా ప్రతి మండల కేంద్రం, మున్సిపాలిటీల్లో నిర్వహించనున్నట్లు వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు అల్లు సోమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి రోజు వాలంటీర్ టీచర్లలో సగం మంది, రెండో రోజు మిగతా సగం మంది శిక్షణ పొందనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి వెలుగు, ఉపాధి హామీ, మెప్మా సిబ్బంది సమన్వయం చేయాలని సూచించారు. ప్రతి మండల, మున్సిపాలిటీలో ఇద్దరు ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరి ద్వారా వాలంటీర్ టీచర్లకు బోధన నైపుణ్యాలు, అక్షర వెలుగు బోధన పుస్తకంలోని అంశాలు వివరించనున్నట్లు పేర్కొన్నారు.

తాగినోళ్లకి తాగినంత

- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు
- ఆదాయం పెంపే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం
- వ్యాపారులు, బెల్టుకు ప్రోత్సహించేలా సర్కారు చర్యలు
- గతేడాదితో పోలిస్తే తగ్గిన కేసులే ఉదాహరణ



మద్యం ద్వారా ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, వాటి అమ్మకాలను పెంచేందుకు రకరకాల పద్ధతులను అనుసరిస్తోంది. గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నమోదు చేసిన కేసులే అందుకు ఉదాహరణ. జిల్లాలో ప్రతి గ్రామంలో కనీసం రెండు నుంచి ఐదారు దుకాణాలు వెలిశాయి. దీంతో మండల కేంద్రానికో, మరో మద్యం దుకాణానికో వెళ్లకుండానే గ్రామంలోనే తాగినోళ్లకి తాగినంత మద్యం దొరుకుతోంది. మద్యాన్ని నియంత్రిస్తామని, బెల్టు షాపులు లేకుండా చేస్తామంటూ కొత్త మద్యం పాలసీ సందర్భంగా ప్రభుత్వం చెప్పిన మాటలు ఉత్తివే అని తేలిపోయింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది అక్టోబరులో కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చింది. అందులో భాగంగా మద్యాన్ని ప్రైవేట్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. జనాభా ఆధారంగా లైసెన్స్ ఫీజులను నిర్ణయించి, ఆ మేరకు లాటరీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు దుకాణాలను కేటాయించింది. ఆవిధంగా జిల్లాలో 177 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. మద్యం ద్వారా బాగా లాభాలు గడించవచ్చని భావించిన వ్యాపారులకు కాలక్రమేణా తత్వం బోధపడింది. అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టిన వ్యాపారులకు లాభం రాకపోగా నష్టాలు ఎదురయ్యాయి. మద్యం నోటిఫికేషన్‌లో 20 శాతం కమీషన్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, తొమ్మిది శాతంతో సరిపెట్టింది. ఆ తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ నుంచి దాన్ని 14 శాతానికి పెంచింది. అయినా నష్టాలే వస్తుండడంతో వారే బెల్టుకు మందు సరఫరా మొదలుపెట్టారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు అన్ని గ్రామాల్లోనూ బెల్టు షాపులు వెలిశాయి. మండలంలోని గ్రామాలను వంతులు వేసుకుని మరీ బెల్టుకు మద్యం సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

వ్యాపారులకు సహకరిస్తున్న ప్రభుత్వం!

బెల్టుషాపుల విషయంలో ప్రభుత్వం చూసీనట్లుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాను ఇవ్వాల్సిన కమీషన్ ఇవ్వకపోవడంతో, వస్తున్న నష్టాన్ని వ్యాపారులే ఏదో రకంగా భర్తీ చేసుకుంటారులే అన్న రీతిలో ప్రభుత్వం ఉన్నట్లుగా కనిపిస్తోంది. దీంతో వారు బెల్టు ద్వారా ఆదాయాన్ని పెంచుకునే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. వారిని ఇబ్బంది పెట్టకుండా పెద్దగా కేసులు, అంత తీవ్రమైన సెక్షన్లు లేకుండా అటు ప్రభుత్వమూ సహకరించేలా వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త మద్యం పాలసీ రాక ముందు, వచ్చిన తర్వాత జిల్లాలో నమోదైన కేసులే ఇందుకు ఉదాహరణ. గతేడాది జనవరి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు 1513 బెల్టు షాపులపై కేసులు నమోదు చేసి 4,420 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. 1513 మందిని అరెస్టు చేశారు. ఈ ఏడాదిలో అదే కాలానికి కేవలం 837 కేసులు నమోదు చేసి 1120 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. 837 మందిని అరెస్టు చేశారు. బెల్టు షాపుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయి.

మామూళ్ల మత్తులో అధికారులు

మద్యం అమ్మకాలు, ఆదాయం పెంపు కోసం ప్రభుత్వమే పరోక్షంగా బెల్టు దుకాణాలకు సహకరిస్తుండడంతో, అబ్కారీ శాఖలోని కొందరు అధికారులకు అది వరంగా మారింది. ప్రతి దుకాణం నుంచి నెలకు నిర్ణయించిన మేరకు సొమ్ములు చేరుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బెల్టు షాపులపై ఏవో కేసులు నమోదు చేయాలి కాబట్టి చేస్తున్నట్లుగా పట్టుకుంటున్నారు. పట్టుకున్న వారిపై ఉత్తుత్తి కేసులతో సరిపెడుతున్నారు. మద్యం బాటిళ్లతో దొరికిన వ్యక్తి ఏ దుకాణం నుంచి తీసుకొస్తున్నాడో తెలిసినా, లైసెన్స్ దుకాణం జోలికి వెళ్లడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. బెల్టుకు మద్యం సరఫరా చేస్తే మొదటిసారి రూ.ఐదు లక్షల అపరాధ రుసుము విధిస్తామని, రెండోసారి పునరావృతమైతే దుకాణం సీజ్ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు ఎక్కడా అమలు కావడం లేదంటే అటు ప్రభుత్వం, ఇటు అధికారుల తీరు ఎలా ఉందో స్పష్టమవుతోంది.

మద్యం దుకాణాల నుంచే బెల్టుకు మందు

తమకు వస్తున్న లాభాలు చాలక కొన్ని చోట్ల, నష్టాల నుంచి బయటపడాలని మరికొన్ని ప్రాంతాల్లో మద్యం వ్యాపారులు సిండికేటుగా ఏర్పడ్డారు. విడిగా వ్యాపారం చేస్తే లాభాలు రావడం లేదని గ్రహించి, క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు పెంచి అమ్ముతున్నారు. అదీ గాక అమ్మకాలు పెంచేందుకు వారే బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేయడం మొదలు పెట్టారు. చాలాచోట్ల మండలంలో ఉన్న గ్రామాలను వంతులు వేసుకుని వారే బెల్టు దుకాణాలకు మద్యాన్ని డెలివరీ చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణకు వేలంపాటలు సైతం వేసినట్లు తెలుస్తోంది. బెల్టు దుకాణాల్లో అన్ని రకాల బ్రాండ్ మద్యం క్వార్టర్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణం గ్రామానికి 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో, అక్కడికి వెళ్లలేక బెల్టు నిర్వాహకులు చెప్పిన రేటు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ఎంపీ ల్యాడ్స్ నిధులు ఖర్చు చేస్తాం

- ఏడాది లోపే పనులు పూర్తయ్యేలా చర్యలు
- జల జీవన్ మిషన్ పనులపై వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఇచ్ఛాపురం నుంచి నరసన్నపేట వరకు ఆరు లైన్ల జాతీయ రహదారి
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎంపీ ల్యాడ్స్ ద్వారా సమకూరే నిధులను ఇకపై సకాలంలో ఖర్చు అయ్యేలా చర్యలు చేపడతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు, జలజీవన్ మిషన్, జాతీయ రహదారి పనులపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ల్యాడ్స్ నిధులతో జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ నిధులతో చేపట్టలేని కొన్ని అభివృద్ధి పనులకు ఎంపీ లాడ్స్ నిధులు వెచ్చించి మౌలిక వసతులు సమకూర్చామని చెప్పారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, బస్ కాంప్లెక్స్‌లు, ఎలక్ట్రికల్ లైన్లు, సోలార్ విద్యుద్దీపాలు వంటి వసతులు కల్పించామన్నారు. ఇకపై ఒక ఏడాదిలో వచ్చిన నిధులతో చేపట్టే పనులను అదే సంవత్సరంలో పూర్తయ్యేలా లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ వినియోగాన్ని పెంచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. నిధుల ఖర్చును పర్యవేక్షించేందుకు ఈ-సాక్షి పేరుతో వెబ్ పోర్టల్‌ను రూపొందించిందని తెలిపారు. జిల్లాలో ఆయా ప్రాంతాల ప్రజలకు కావాల్సిన కనీస వసతులపై స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి అభివృద్ధికి నిధులు వెచ్చిస్తామని చెప్పారు. జిల్లాలో నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా మారుస్తామని వెల్లడించారు. మందస ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు తదితర ప్రాంతాల వద్ద జాతీయ రహదారిని అనుసంధానం చేసే పనులు చేపడతామని తెలిపారు. జాతీయ రహదారిపై జాతీయ రహదారికి సమాంతరంగా ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వరకు కోస్టల్ కారిడార్ నిర్మిస్తామని చెప్పారు. జిల్లా పరిధిలో 180 కిలోమీటర్లకు పైగా ఉన్న జాతీయ రహదారిలో అనేక బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని, ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జల జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన నిధులను సరిగా వినియోగించలేదన్నారు. పది శాతం పనులు కూడా పూర్తి కాలేదని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణలో రాష్ట్రం ముందంజ

- జిల్లా కేంద్రాస్పత్రుల్లో సంపూర్ణ సురక్ష కేంద్రాలు
- రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టు సంచాలకులు కె.నీలకంఠ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధి పూర్తిగా నియంత్రణలోనే ఉందని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టు సంచాలకులు కె.నీలకంఠ రెడ్డి తెలిపారు. 2010లో 4.1 శాతం ఉన్న వ్యాధి ప్రస్తుతానికి 0.5 శాతానికి తగ్గిందని చెప్పారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎఆర్‌టి కేంద్రాన్ని గురువారం సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై హెచ్ఐవి రోగులకు ఒకేచోట అన్నిరకాల సేవలందించే ఉద్దేశంతో జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో సంపూర్ణ సురక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇంత వరకు నాలుగు విభాగాల ద్వారా సేవలందించగా, ఇకపై సింగిల్ విండో విధానంలో అందించేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వ్యాధి నివారణకు విస్తృత అవగాహనా కార్యక్రమాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అనేక ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో 2.75 లక్షల మంది ఎయిడ్స్ రోగులు ఉన్నారని, వీరందరికీ ఉచిత మందులు, పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. త్వరలో 42 వేల కొత్త పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు నిర్వహిస్తున్న సర్వేలో మరో 50 వేల మంది రోగులు గుర్తించబడే అవకాశం ఉందని, వారికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మేరీ కేథరిన్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి తాడేల శ్రీకాంత్, రిమ్స్ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎఆర్‌టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న నీలకంఠ రెడ్డి

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

యువతకు ప్రధానమంత్రి రైతునిధి, ఆయుష్మాన్ భారత్, నైపుణ్య భారతం వంటి ప్రధాన పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు పి.కిరణ్‌కుమార్ తెలిపారు. నెహ్రూ యువ కేంద్రంలో జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహనా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణలు ఇస్తున్నట్లు తెలిపారు. మేరా యువ భారత్ ఉప సంచాలకులు కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ఆరోగ్య భారత్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధానమంత్రి రుణ పథకం, డిజిటల్ భారత్, నైపుణ్య భారతం, స్వచ్ఛ భారత్, ప్రతి ఇంటికీ నీరు పథకం, విశ్వకర్మ యోజన, స్టాండ్ అప్ ఇండియా, ఉజ్వల యోజన తదితర పథకాలపై యువజన, మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు.

జిల్లా పరిశ్రమల శాఖ ప్రధాన అధికారి జి.ఎం శ్రీధర్ మాట్లాడుతూ చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వాలు అందించే పథకాలు, రాయితీలు, రుణ సౌకర్యాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో నాబార్డు సహాయ ప్రధాన అధికారి కె.రమేష్‌కృష్ణ, ఎల్‌డిఎం పి.శ్రీనివాసరావు, రాష్ట్ర సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు, సెట్‌శ్రీ సిఇఒ వి.వి అప్పలనాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు స్వచ్ఛంద, మహిళా సంఘాల ప్రతినిధులు, మేరా యువ భారత్ వాలంటీర్లు పాల్గొన్నారు.





ప్రచారం చేస్తున్న ప్రజా, గిరిజన సంఘ నాయకులు

'థర్మల్'కు బలవంతపు భూసేకరణ వద్దు

ప్రజాశక్తి - బూర్జ

థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలని ప్రజాసంఘాల నాయకులు కె.మోహనరావు, కె.నాగమణి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 22వ తేదీన అడ్డూరుపేటలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో భూసేకరణ బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా బొమ్మిక, గోపిదేవీపేట, జోగిపాడు, వెంకటాపురం, జంగాలవలస, అడ్డూరుపేట, తిమడాం తదితర గ్రామాల్లో గురువారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అటు అణు విద్యుత్, ఇటు కార్గో ఎయిర్‌పోర్టు, ఇక్కడ థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో ప్రజల భూములను, ప్రకృతి వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి పూనుకుంటోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ బలవంతపు భూసేకరణను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఉండే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, చివరి భూములకు నీరు ఇస్తే జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యావరణానికి ముప్పు తెచ్చే థర్మల్ ప్లాంట్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బాడంగి సురేష్, సవర లక్ష్మణరావు, సవర నాగరాజు, కంట అప్పలనాయుడు, ఆర్.రామస్వామి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌టిసి డిపో వద్ద శుక్రవారం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ఎం.ఎస్.ఎస్.నాయుడు తెలిపారు. ఈ మేరకు డిపోలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆర్‌టిసి సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్‌టిసికి సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్నా డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో ఫోన్ ద్వారా పిర్యాదు చేయవచ్చు అన్నారు. బస్సులు రాకపోకలు, నిలుపుదల, సమయాల మార్పులు, చేర్పులు తదితర అంశాలపై సలహాలు సూచనలు ఇవ్వవచ్చు అన్నారు. ప్రజలు, ప్రయాణికుల ఇచ్చిన ఫిర్యాదులు, సలహాలు పరిగణనలోకి తీసుకుని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో ఫోన్ నంబరు 9959225610కు సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన ఉపాధ్యాయులకు నిరాశ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

డిఎస్‌సికి ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు అమరావతిలో శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉంది. ఈరోజు కోసం ఉత్సాహంగా ఎదురుచూసిన వారికి నిరాశ ఎదురైంది. విజయవాడ పయనమయ్యేందుకు నూతన ఉపాధ్యాయులు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకున్నారు. 37 బస్సులు సిద్ధం చేయడంతో పాటు నూతన ఉపాధ్యాయులు, వారితో వచ్చిన తల్లిదండ్రులకు అల్పాహారం పెట్టారు. జిల్లా నుంచి ఎంపికైన మొత్తం 675 మంది ప్రయాణానికి సిద్ధమయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు, సమగ్రశిక్ష ఎపిసి శశిభూషణ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. బస్సుల ప్రారంభానికి ఉన్నతాధికారులు వస్తున్న సమయంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నుంచి శుక్రవారం నిర్వహించాల్సిన కార్యక్రమం వాయిదా పడినట్లు సమాచారం వచ్చింది. అమరావతిలో వర్షాల కారణంగా కార్యక్రమం వాయిదా పడిందని, తదుపరి తేదీ త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు చెప్పడంతో నూతన ఉపాధ్యాయులు వెనుదిరిగారు. గతంలో ఎంపికైన అభ్యర్థులకు స్థానికంగా అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేసి, కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చేవారు. ధ్రువీకరణ పత్రాలు అందజేసే తేదీ కోసం ఎంపికైన ఉపాధ్యాయులు నిరీక్షిస్తున్నారు. విద్యా శాఖ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.



ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకున్న నూతన ఉపాధ్యాయులు

మెరుగైన ఫలితాలే లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సంక్షేమ వసతిగృహాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యమిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మధుసూదన్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ అడిటోరియంలో సంక్షేమ వసతిగృహాల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు లక్ష్యంగా ముందుకు సాగాలని చెప్పారు. కనీసం 90 శాతం దాటి ఫలాతాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, టి నమూనాలు సేరించి సురక్షితమైన తాగునీరు అందించే చర్యలు తీసుకోలని సూచించారు. ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో హాజరు నమోదు చేసి విద్యార్థులకు మెనూ అమలు చేయాలని చెప్పారు. వసతిగృహాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వసతిగృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఎపిసి ఎస్.శశిభూషణ్, బిసి సంక్షేమ శాఖ అధికారి అనురాధ తదితరులుపాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో మేఘవరం పంచాయతీ రైతులకు తిర్లంగి రైతు సేవా కేంద్రం వద్ద గురువారం యూరియా కోసం అన్నదాతలు పడిగాపులు కాశారు. పాస్ పుస్తకానికి ఒక యూరియా బస్తా ఇస్తామని రైతు సేవా కేంద్రం వద్దకు రావాలని అధికారులు సూచించారు. దీంతో రైతులందరూ కలిసి ఆటోలు కట్టించుకుని తిర్లంగి రైతు సేవా కేంద్రానికి తరలివెళ్లారు. ఎక్కువ మంది రైతులను చూసిన అధికారులు మొహం చాటేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతలో వర్షాలు లేక తీవ్ర అవస్థలు పడ్డామని, ఇప్పుడు వర్షాలు పడి ఊరట కలిగించిందని అన్నారు. ఈ ఏడాది ఎరువులు సకాలంలో అందకపోవడంతో పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు.

ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు నిర్ణీత ధరల కన్నా అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటనలు చేస్తున్నారని, కానీ చర్యలు మాత్రం శూన్యమని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేచి ఉన్న రైతులు

నేడు స్వాభిమాన్ గ్రీవెన్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం స్వాభిమాన్ ప్రత్యేక గ్రీవెన్స్‌ను శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

22న డ్రోన్ పైలట్ ఉద్యోగాలకు ఎంపికలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



ఈనెల 22వ తేదీన నగరంలోని అభ్యుదయ డిగ్రీ కాలేజ్‌లో డ్రాగ్ డ్రోన్స్ ప్రైవేట్ కంపెనీకి సంబంధించి డ్రోన్ పైలట్ ఉద్యోగాల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, అంతకంటే పై చదువు పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయసు గల పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వబడుతుందని, ఈకాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతో పాటు నెలకు రూ.ఐదు వేల స్టైఫండ్ అందజేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం నెలకు రూ.22 వేల జీతంతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఎంపికైన వారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ రెజ్యూమ్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం తొమ్మిది గంటలకు అభ్యుదయ డిగ్రీ కాలేజ్‌లో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95509 67353 నంబరును సంప్రదించాలని తెలిపారు.



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి- పలాస

మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.మురగన్, ఎస్.శంకర్ డిమాండ్ చేశారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో వద్ద గత సమ్మె కాలపు ఒప్పందాలతోపాటు ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ గురువారం నిరసన తెలిపారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిటీ నియమించి వేతనాలు సవరించి రూ.25 వేలు ఇవ్వాలన్నారు. విశ్రాంత బెనిఫిట్స్ ఇవ్వాలని, ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. దహన సంస్కారం ఖర్చులు రూ.20 వేలుకు పెంచాలన్నారు. గత సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని కోరారు. రూ.33 లక్షల పాత పిఎఫ్ సొమ్మును కార్మికుల ఖాతాలలో జమచేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అమరనాయక్, ఎం.రవి, ఎన్.డిల్లీ, తిరుపతి, ఎస్.రమేష్, కె.వెంకట్, త్రివేణి పాల్గొన్నారు.



మానసిక ఆరోగ్య విభాగాన్ని పరిశీలిస్తున్న హరిబాబు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటి

చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మానసిక ఆరోగ్య విభాగాన్ని, వన్‌స్టాప్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రోగులను పరామర్శించి, వారికి అందిస్తున్న వైద్యసేవలు, పౌష్టిక ఆహార సరఫరా, ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. సైకియాట్రిస్ట్ వద్ద చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితులను ఆరాతీసి, వైద్యులకు అవసరమైన సూచనలు అందించారు. అక్కడ నమోదు చేసిన కేసుల వివరాలను తెలుసుకున్నారు. మానసికంగా రోగులు సాధారణ స్థితికి చేరేలా వైద్యం ఉండాలన్నారు. కౌన్సెలింగ్ పద్ధతిలో చికిత్స నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ డి.విజయలక్ష్మి, టి.అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



చెరువులను పరిశీలిస్తున్న తహశీల్దార్ గణపతి

చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

చెరువులను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం తహశీల్దార్ ఎస్. గణపతి హెచ్చరించారు. గురువారం శ్రీకాకుళం రూరల్ మండలంలోని అలాగే ఆమదాలవలస మున్సిపాలిటీ ఆరోవార్డు పరిధిలోని కె.మన్నయ్యపేటలోని చొక్కాకుల బంధ, ఇతర చెరువులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని చెరువులను ఆక్రమణకు గురవుతున్నట్లు పలు ఫిర్యాదులు అందాయని, దాని నిమిత్తం ఇక్కడకు వచ్చి చెరువులను పరిశీలించడం జరిగిందన్నారు. తొందరలోనే సర్వే చేసి ఆక్రమణలు తొలగించడం జరుగుతుందన్నారు. గతంలో చొక్కాకుల బంధ చెరువు ఆక్రమణను కొంతమేరకు తొలగించడం జరిగిందని, ఇంకా ఏమైనా ఆక్రమణకు గురైతే తొందరలోనే పూర్తిస్థాయిలో తొలగిస్తామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈయనతో పాటు మండల సర్వేయర్, విఆర్‌ఒ, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

కేంద్రమంత్రిని కలిసిన శివాజీ

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో రైల్వే ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలని మాజీ మంత్రి గౌతు శివాజీ కోరారు. ఈ మేరకు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. వజ్రపుకొత్తూరు నుంచి అక్కుపల్లి మీదుగా మున్సిపాలిటీకి అనుసంధానం చేస్తూ నిర్మాణం జరిగిన రోడ్డు మధ్యలోనే ఆగిపోయిన రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్రమంత్రి స్పందించి కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

టెక్కలి : వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తన నివాసగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శేషగిరికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. పార్టీలో కష్టపడిన వారిని పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని కేంద్రమంత్రి అన్నారు. శేషగిరితో పాటు దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, సలాన వినోదకుమార్ ఉన్నారు.



టెక్కలి : శేషగిరిని సన్మానిస్తున్న కేంద్రమంత్రి

యూరియా అందించాలి




మాట్లాడుతున్న లోలాక్షి, కృష్ణారావు

కంచిలి: మండలానికి రైతులకు అవసరమైన మేరకు యూరియా అందించాలని జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, మాజీ ఎంపిపి ఇప్పిలి కృష్ణారావు కోరారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితులు నేపథ్యంలో వరి నాట్లు ఆలస్యంగా పడ్డాయి అన్నారు. సుమారుగా నెల రోజులు ఆలస్యం కావడంతో యూరియా అవసరత ఎక్కువగా ఉందన్నారు. ప్రారంభంలో నాట్లు ఎక్కువ విస్తీర్ణంలో పడకపోవడంతో ఆ ప్రాప్తికి ఎరువులు కేటాయించారన్నారు. అవసరమైన మేర యూరియా అందకపోవడంతో మండలంలో రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు షాపుల వద్ద యూరియా కోసం ఘర్షణలకు సైతం దిగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పార్టీలకతీతంగా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మండలానికి అవసరమైన ఎరువులు అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రైతుల ఇబ్బందులను పరిష్కరించని పక్షంలో పదిరోజుల అనంతరం బాధిత రైతుల తో కలిసి శాంతియుత నిరసన కార్యక్రమం చేపడతామన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

మున్సిపల్ మంత్రిని కోరిన ఎమ్మెల్యే శిరీష

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశం విరామం సమయంలో ఆయన ఛాంబర్‌లో గురువారం వినతిపత్రం అందజేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించేందుకు, నెహ్రూ పార్కు బ్యూటిఫికేషన్, సిసిరోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, బీటీ రోడ్లకు కనెక్టివిటీ తదితర అంశాలను ప్రస్తావించారు. ఇందుకుగాను రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయాలని విన్నవిస్తూ... ప్రతిపాదనలను ఆయనకు అందజేశారు. అలాగే జంట పట్టణాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ఉద్దానం రక్షిత తాగునీటి పథకం నుంచి 5 ఎమ్మెల్డీ వాటర్‌ను మున్సిపల్ ప్రజలకు కేటాయించారని అన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్ల సాయంతో 1.5 ఎమ్మెల్డీ వాటర్ మాత్రమే తీసుకోగలుగుతున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగడంలేదని వివరించారు. ఇందుకుగాను సూది కొండ తదితర ప్రాంతాల్లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను, పైపులైన్లను అమృత్ 2.0 నిధుల ద్వారా నిర్మించాల్సి ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్‌శాఖ అధికారులు రూ.1.5 కోట్లతో అంచనాలు తయారు చేశారని అన్నారు. ఈ అంశాలపై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ప్రజాశక్తి- పలాస

విద్యుత్ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ జిపిఎఫ్, సిపిఎఫ్ సాధన సమితి ఉద్యోగులు విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. 1999 నుంచి 2004లో ఉద్యోగంలో చేరిన ఉద్యోగులు అందరికి జిపిఎఫ్, ఇపిఎఫ్తో పాటు పాతపెన్షన్ విధానం అన్ని శాఖల ఉద్యోగులకు అమలు చేస్తున్నప్పటికీ విద్యుత్ శాఖ ఉద్యోగులకు విస్మరించి ఈ విధానం నుంచి దూరం చేయడం సరికాదని అన్నారు. అందరి ఉద్యోగులు మాదిరిగా ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులకు కూడా పాతపెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జెఎఇ ఎన్.అప్పికొండ, సీనియర్ అసిస్టెంట్లు శేఖర్, వి.ధనరాజు, సిహెచ్.శ్రీధర్, కె.తేజేశ్వరరావు, ఎన్.భాస్కరరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

ఆ సచివాలయం మాకొద్దు



నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కాపుతెంబూరు సచివాలయం రైతు భరోసా కేంద్రాల్లో మా పంచాయతీని తొలగించాలని సుభద్రాపురానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. కాపుతెంబూరు గ్రామ సచివాలయ పరిధిలోనీ రైతు సేవా కేంద్రం నుంచి అదే సచివాలయ పరిధిలోనే సుభద్రపురానికి నేటి వరకు ఒక బస్తా ఎరువు కూడా ఇవ్వకుండా గ్రామస్తులు అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు యూరియా అందిస్తున్నా మా గ్రామానికి చెందిన రైతులకు అందడం లేదని అన్నారు. ఎఒ బి.శ్రీకాంత్‌వర్మతో ఫోన్ మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎఒ మాట్లాడుతూ మీ పంచాయతీకి వంద బస్తాలు యూరియా అందిస్తానని హామీ ఇచ్చారు. కాపుతెంబూరు సచివాలయం నుంచి వేరుచేసి నందిగాం గాని, పెద్దలవినిపల్లి సచివాలయానికి కాని విలీం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.సోమేశ్వరరావు, రైతులు పి.శంకరరావు, డి.కర్రయ్య, ఉమాపతి, కరువయ్య, పి.ధర్మారావు, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలే శరణ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఐక్య పోరాటాలే శరణ్యమని సిఐటియు జిల్లా నాయకులు ఎన్.గణపతి అన్నారు. ఎం.మంజులకుమారి అధ్యక్షతన వజ్రపుకొత్తూరులో సిఐటియు మండల మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలపై పోరాటాలు నిర్వహించడమే మన ముందున్న కర్తవ్యమని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు ఎన్.మోహనరావు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతిఘటించక తప్పదని హెచ్చరించారు. ఆటో కార్మికులకు రూ.30 వేలు ఇవ్వాలన్నారు. బెండి, నువ్వలరేవు, పెద్దబడం, నువ్వలరేవు రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని తీర్మానం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎన్.మోహనరావు, కో-కన్వీనర్లుగా ఎం.మంజులకుమారి, బి.లక్ష్మీతో పాటు 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సభలో ప్రజానాట్య మండలి నుంచి చంద్రయ్య, భాస్కరరావు పాడిన పాటలు చైతన్యాన్ని రగిలించాయి. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రాజు, తిరిపతి, అంగన్వాడీ నుంచి చామంతి, నారాయణి, ఆశా నుంచి కృష్ణవేణి, రమణమ్మ, విఒఎ నుంచి శ్రీదేవి, నిర్మల, హమాలి నుంచి ఎల్.మోహనరావు, మధ్యాహ్న భోజనం పథకం నుంచి కృష్ణకుమారి, భవన నిర్మాణ కార్మికులు నుంచి ఎస్.మల్లేషు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ



వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

షెడ్ నిర్మాణానికి నిధుల మంజూరు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట పట్టణంలోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద షెడ్ నిర్మాణానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రూ.పది లక్షలు మంజూరు చేసినట్లు టిడిపి మండల అధ్యక్షుడు మద్దు కుమార్, పట్టణ అధ్యక్షుడు చిత్రాడ శేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి గౌత శివాజీతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరుకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను కలిశామన్నారు. ఆయన అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని తెలిపారు. దీంతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవు రాము పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీలో చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి గురువారం పరిశీలించారు. ఆధిఆంధ్రావీధి, బైరివీధి తదితర ప్రాంతాల్లో పర్యటించిన పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఇఒ శ్రీనివాసరావు 154 వీధులు ఉన్నాయని, 134 వీధులకు కాలువలు ఉన్నాయని, 19 వీధులకు వీడి కచ్చ కాలువలు ఉన్నాయని తెలిపారు. గత పదేళ్ల నుంచి మరుగు పేరుకుపోయిందని స్థానికులు తెలిపారు. శ్రీకాకుళం నుంచి ప్రైవేటు కార్మికులతో పారిశుధ్యం పనులు చేయిస్తున్నట్లు వివరించారు. ఈమె వెంట టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ, డిప్యూటీ ఎంపిడిఒ కె.సింహాద్రి ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ సైన్స్ గెస్ట్ ప్యాకల్టీ నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.సిహెచ్ మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాం మార్కులతో పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి ఉండాలని, అలాగే సంబంధిత సబ్జెక్టులో యుజిసి నెట్, ఎపిసెట్, పిహెచ్‌డి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 22లోగా కళాశాలలో దరఖాస్తులను సమర్పించి, 25వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లుతో హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 81067 85918, 9963559593 నంబర్లను సంప్రదించాలన్నారు.

కాశీబుగ్గ డిఎస్‌పి బదిలీ

పలాస : కాశీబుగ్గ డిఎస్‌పి వి.వి.వెంకట అప్పారావు గురువారం బదిలీ అయ్యారు. ఈయన గతేడాది నవంబరులో డిఎస్‌సిగా బాధ్యతలు చేపట్టారు. తక్కువ సమయంలో బదిలీ కావడంతో పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. పోలీస్ జిల్లా కార్యాలయంలో రిపోర్టింగ్ చేయాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు వచ్చినట్లు పోలీసు వర్గాలు తెలిపారు.



వెంకట అప్పారావు

మహిళ ఆత్మహత్య

నందిగాం : మండలంలోని దీనబంధుపురం పంచాయతీ తమలాపురానికి చెందిన కె.శిల్పచౌదరి (24) బుధవారం ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ షేక్ మహమ్మద్ ఆలీ తెలిపారు. ఆమె భర్త రాజీవ్ కుమార్ కొద్ది రోజులుగా వేధింపులకు పాల్పడడంతో ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. రాత్రి ఇంటిలోని మెడపై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. గురువారం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు. సిఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు.



చికిత్స పొందుతున్న రూపావతి

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఎదుట మండలంలోని గొల్లమాకన్నపల్లికి చెందిన వివాహిత రాపాక రూపవతి గురువారం పురుగులు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. పోలీసులు, కుటంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రూపవతికి మందస మండలం లింబుగాంకు చెందిన భానుతేజతో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి బాబు పుట్టాక భార్యభర్తల మధ్య గొడవలు ఏర్పడడంతో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో నెలరోజులు క్రితం ఫిర్యాదు చేశారు. దీనితో కాశీబుగ్గ పోలీసులు భార్యాభర్తలకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి రాజీ చేసి పంపించారు. గురువారం రూపావతి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తన భర్తతో పాటు తన అత్తామామలు ఏకమై తనను వేధించి, దాడి చేశారని మరోమారు ఫిర్యాదు చేశారు. దీనితో కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ రూపవతి భర్త భానుతేజతో ఫోన్‌లో సంప్రదించారు. భానుమూర్తి కేసు కట్టుకుంటే కట్టుకొండి నేను ఆవితను ఏలుకోనని సమాధానం ఇచ్చారు. దీంతో భర్త తనకు దూరం అవుతున్నాడనే మనస్తాపంతో రూపవతి పిల్లవాడికి స్టేషన్ వద్దనే ఉంచి బిస్కట్ కొని తెస్తానని చెప్పి, బజారుకు వెళ్లి పురుగులు మందు కొనుక్కొని తాగింది. అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్ స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే పోలీసులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు.

అనారోగ్యంతో పోర్టు కూలీ మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని మూలపేట పోర్టులో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఫక్లు పింగ్వా (36) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన రెండు వారాల క్రితమే పోర్టులో పనిచేసేందుకు వంట కూలి పనులకు వచ్చారు. బుధవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురై గురువారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతదేహాన్ని సొంత ప్రాంతానికి తరలించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని తోట కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై నౌపడ పోలీసులకు సమాచారం అందించారు.



పింగ్వా మృతదేహం

లారీ డ్రైవర్‌కు గాయాలు

ఎచ్చెర్ల: మండల పరిధిలో కేశవరావుపేట జాతీయ రహదారి సమీపంలో గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ రామ్‌నాథ్ రాయ్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఎస్‌ఐ వి.సందీప్ కుమార్ తెలిపిన వివరాల మేరకు ఒడిశా నుంచి విశాఖపట్నం పోర్టుకు వెళ్తున్న కంటైనర్ లారీ కేశవరావుపేట వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. స్థానికులు సమాచారంతో పెట్రోలింగ్ పోలీసులు 108 వాహనంలో గాయాలపాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సరోజనాస్పత్రికి తరలించారు. డ్రైవర్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావటంతో పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు దర్యాప్తు చేసి కేసు నమోదు చేశారు.

తోటపల్లి బ్యారేజీని సందర్శించిన ఎంపీ

రణస్థలం: పార్వతీపురం వద్ద సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గురువారం ఇరిగేషన్ శాఖ అధికారులతో సందర్శించారు. తన పార్లమెంట్ పరిధిలో దిగువ ప్రాంతాల్లో చివరి వరకు ఆయుకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందించలేక పోవడానికి గల కారణాలను ఇరిగేషన్ అధికారులతో పరిశీలించారు. గత ప్రభుత్వం అలసత్వం, నిర్లక్ష్య కారణంగా ప్రాజెక్టులో గుర్రపు డెక్క పేరుకుపోవడం, నీరు ప్రవహించే కెనాల్స్‌లో ఇసుక తెన్నులు పేరుకుపోవడం వలన కెనాల్ గట్లు గండి కొట్టడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ప్రాజెక్టు అధికారులను పై సమస్యలపై రిపోర్ట్ తయారు చేసి ఇవ్వాలని సూచించారు.




తోటపల్లి ప్రాజెక్టును సందర్శిస్తున్న ఎంపీ కలిశెట్టి

మురుగు నీటితో ఇక్కట్లు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలో ఎస్ఎంపురం గ్రామంలో గత నాలుగు నెలల క్రితం డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. అయితే కాలువ నిర్మించకపోవడంతో గ్రామం నుంచి వచ్చిన మురుగునీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుంది. నెలల తరబడి మురుగు ప్రవహించడంతో రోడ్డుపై నాచు చేరడంతో అటువైపు నుంచి వస్తున్న సుమారు నాలుగు గ్రామాల ప్రజలు, శ్రీకాకుళం వెళ్లే రహదారి మార్గం కావడంతో అక్కడకు వచ్చేసరికి వాహనాలు అదుపుతప్పి గాయాల పాలవుతున్నారు. మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో దుర్గంధ వాసన భరించలేకపోతున్నామని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే ఈ మురుగునీరు దిగువున ఉన్న పంట పొలాల్లోకి ప్రవహించడంతో వరి పండిస్తున్న రైతులకు ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోతున్నారు. మురుగునీటితో వరికి దోమపోటు వచ్చే అవకాశాలున్నాయని ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



తవ్వి వదిలేసిన కాలువ

ప్రమాదకరంగా పాఠశాల భవనాలు

- పగుళ్లు, పెచ్చులూడి పడుతున్న శిథిల భవనాలు
- భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి- పొందూరు

సుమారు నాలుగు దశాబ్దాలు దాటిన ఆ పాఠశాల భవనాలు ప్రమాదకరంగా మారాయి. ఎక్కడికక్కడే పగుళ్లు ఏర్పడి, పెచ్చులూడి పడుతుండడంతో అవి ఎప్పుడు కూలుతాయో, ఏ ప్రమాదం సంభవిస్తుందోనంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇది పొందూరు మండలంలోని గోరింట ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో వినియోగంలో లేని భవనాల పరిస్థితి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సుమారు 40ఏళ్లకుపైగా నిర్మించిన నాలుగు పాఠశాల భవనాలు ఉన్నాయి. కొంతకాలం ఈ భవనాల్లో పాఠశాల తరగతులను నిర్వహించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాన్ని కూడా ఈ భవనాల్లో నిర్వహించారు. భవనాలు శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడి పడుతుండడంతో తరగతి గదులను మూసివేసి వేరే భవనంలో తరగతులను నిర్వహించారు. అలాగే అంగన్వాడే కేంద్రాన్ని సైతం వేరేచోటకు తరలించారు. ఇప్పుడు ఆ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని శ్లాబ్, గోడలకు పగుల్లు ఏర్పడి పెచ్చులూడి పడుతున్నాయి. ఇటీవల వర్షాలకు పెద్దఎత్తున పెచ్చులూడి పడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విధంగా ఎప్పటికప్పుడే పెచ్చులూడి పడుతున్నా యంటూ విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ శిథిల భవనాల వెనుక గల భవనంలో విద్యార్థులకు తరగతులను నిర్వహి స్తున్నారు. ఆ తరగతి గదులకు వెళ్లాలంటే ఈ శిథిల భవనాల మధ్య నుంచే విద్యార్థులు వెళ్లాల్సి ఉంది. ఆ సమయంలో పగుళ్లు ఏర్పడిన గోడలు పడినా, పెచ్చులూడి విద్యార్థులపై పడితే పెను ప్రమాదం తప్పదంటూ తల్లిదండ్రులు, గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



పెచ్చులూడిన భవనం శ్లాబ్‌పై భాగం

శిథిల భవనాలు తొలగించాలి

గ్రామంలోని పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థలో ఉండి నిరుపయోగంగా ఉన్న భవనాలను తొలగించాలంటూ సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఈ భవనాలు కూలి ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పం దించి నిరుపయోగంగా ఉన్న భవనాలను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.



పడిన శ్లాబ్ పెచ్చులను చూపుతున్న విద్యార్థులు, గ్రామస్తులు

సాగునీటిపై అసెంబ్లీలో చర్చ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

రైతుల సాగునీటి సమస్యలపై వంశధార రైట్ కెనాల్ నుంచి గార మండలంలోని 37టీ తైల్యాండ్ పరిధిలో ఉన్న గ్రామాలకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గురువారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ సభ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా 37టీని 2006లో పనులు ప్రారంభించి 2009లో నిలుపుదల చేశారని, దీంతో 2600 ఎకరాలకు సాగునీరు నిలిచిపోయిందని వివరించారు. ఈ పనులకు సంబంధించి రూ.10.10 కోట్లతో పనులు ప్రతిపాదనలు చేశామని, అయితే పాత కాంట్రాక్టు నిలుపుదల చేయకపోవడం వలన పనులు ప్రారంభించలేదని ఎమ్మెల్యే తెలిపారు. నీటిపారుదల విభాగం దీనిని సుమాటోగా స్వీకరించి ఆ కాంట్రాక్టును మూసివేసి పనులు మరలా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ గార మండలంలో ఎండిపోయిన ఆయకట్టుకు నీటి సరాఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అలాగే గార మండలంలోని అంబళ్లవలస, కొత్తవలస ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. అంబళ్లవలస ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి తిరిగి రూపొందిస్తామని స్పష్టం చేశారు. వంశధార రైట్ కెనాల్ పరిధిలోని పలు గ్రామాలకు సంబంధించి 37 తైలాండ్‌కు సంబంధించి 4,600 ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు.

ఇక్కడ ప్రస్తుతం 2,537 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని, త్వరలోనే మిగిలిన ప్రాంతానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఏప్రిల్ 22న శ్రీకాకుళం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యే ఈ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చామని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశామన్నారు. టైల్యాండ్ ప్రాంతానికి ఎమ్మెల్యే అడిగినట్టు మూడు కిలోమీటర్ల మేర లైనింగ్ నిర్మాణానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. పాత కాంట్రాక్టును నిలుపుదల చేసి త్వరలో పనులు ప్రారంభించి టైలెండ్ పరిధిలోని 11 గ్రామాలకు సాగునీరు అందిస్తామని వివరించారు. అలాగే ఉత్తరాంధ్రలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను రెండు దశల్లో పూర్తి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

పట్టుదలతో సాధించి.. గురువులుగా నిలిచారు

ఒకే గ్రామానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులుగా

ప్రజాశక్తి- బూర్జ

కృషి, పట్టుదలతో మొక్కవోని దీక్షతో అనుకున్నది సాధించారు. గురువులుగా మారడంతో పాటు భావితరాలకు ఆదర్శంగా నిలిచారు. ఒకే గ్రామంలో నలుగురు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం విశేషం. అందులో ఒకే ఇంట్లో ఇద్దరు అక్కచెల్లెల్లు ఉపాధ్యాయులుగా నిలిచారు. మండలంలోని డొంకలపర్త గ్రామంలో నలుగురు వ్యక్తులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గ్రామంలోని అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న తల్లి జడ్డు తులసి, వ్యవసాయ కూలిగా తండ్రి గణపతిరావులు పనిచేస్తూ తమ కుమార్తెలను కష్టపడి చదివించారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేందుకు అక్కచెల్లెల్లు జడ్డు సాయి ప్రసన్న స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, పిజిటి మ్యాథ్స్ రెండు ఉద్యోగాలు సాధించి జిల్లాలో 9వ ర్యాంకు సాధించింది. అలాగే జడ్డు కుసుమ కుమారి ఎస్‌జిటిగా జిల్లాలో 71వ ర్యాంకు సాధించింది. అదే గ్రామానికి చెందిన కుప్పిలి తిరుపతిరావు తెలుగు ఉపాధ్యాయునిగా కొలువుదీరాడు. తండ్రి దాలయ్య అదే గ్రామంలో విఆర్‌ఎగా పని చేస్తున్నాడు. అలాగే స్పోర్ట్స్ కోటాలో బలగ గణేష్ వ్యాయామ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యాడు. జిల్లాలో స్పోర్ట్స్ కోటాలో ఉన్న ఒకే ఒక పోస్ట్ గణేష్ సాధించడం విశేషం. తమ గ్రామానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో గ్రామస్తులు నలుగురిని అభినందించారు.



ఎంపికైన నలుగురు ఉపాధ్యాయులు

సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో రెండో రోజు గురువారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ప్రయోగాలను సందర్శించారు. ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులు సారాంశాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు ఎగ్జిబిషన్‌ను పర్యవేక్షించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ గొంటి శ్రీధర్ సందర్శించి ప్రయోగాలను ప్రదర్శించిన విద్యార్థుల కృషిని, శాస్త్రీయ దృక్పథాన్ని వారికున్న అవగాహనను అభినందించారు. ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్ ద్వారా సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించవచ్చని ఎగ్జిబిషన్ కన్వీనర్ ప్రదీప్ అన్నారు. ముగింపు కార్యక్రమంలో మేరా భారత్ డిప్యూటీ డైరెక్టర్ వెంకట ఉజ్వల్ విద్యార్థులకు శాస్త్ర పరిశోధన రంగంలో కెరీర్ సంబంధించిన విషయాలను వివరించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు ప్రయోగాల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



ప్రభుత్వ స్థలానికి సరిహద్దులు వేస్తున్న సిబ్బంది

ఆక్రమణలపై అధికారుల చర్యలు

ప్రజాశక్తి - కంచిలి

మండలంలోని జాడుపూడి పంచాయతీ పెద్ద కొజ్జీరియ సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 237 బి12బి, 241బి2బి లోని సుమారు 62 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. సుమారు ఆరు ఎకరాల ప్రభుత్వ భూమికి చెందిన యజమానులు తమ స్థలం మధ్యలో ఉన్న ప్రభుత్వ గోర్జిని ఆక్రమించారంటూ గ్రామస్తులు స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై స్థానిక తహశీల్దార్ రమేష్ కుమార్, ఆర్‌ఐ కృష్ణచంద్ర రౌత్, సిబ్బందితో కలిసి ఆక్రమణలపై పరిశీలించారు. సదరు వ్యక్తులు ప్రభుత్వ గోర్జిని సైతం చదును చేసి ఉండటం గమనించి, ప్రభుత్వ స్థలానికి సంబంధించి సరిహద్దులు ఏర్పాటు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ వారికి తహశీల్దార్ ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమించినట్టు రుజువైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాబ్‌మేళాలో 371 మంది ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

స్థానిక సన్ డిగ్రీ, పిజి కళాశాల ఆధ్వర్యంలో రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో మెగా జాబ్‌మేళాను గురువారం నిర్వహించారు. 15 కంపెనీల యాజమాన్య ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.వి రాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సి.ఎచ్.గంగాధర్, ఇంటిగ్రేటెడ్ కంపెనీ సీఈఓ ఆర్.నరేంద్ర పర్యవేక్షించారు. 652 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 371 మంది అభ్యర్థులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందారు. ప్రిన్సిపాల్ జయరాం మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ల్యాబ్‌ల తనిఖీ

కొత్తూరు: మండల కేంద్రం నివగాం రోడ్‌లోని శ్రీనివాస జనరల్ అండ్ మెడికల్ స్టోర్, బత్తుల రోడ్‌లోని వెంకటేశ్వర ల్యాబ్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్, నాలుగు రోడ్ల కూడలిలోని సునీత మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌లను కురిగాం పిహెచ్‌సి ప్రధాన వైద్యులు పెద్దిన ప్రసన్న కమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ కాలం చెల్లిన మందులు ఉంచరాదన్నారు. రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. 15 రోజుల తర్వాత మరలా వస్తానని, ఏమైనా పొరపాట్లు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయన వెంట ఎఒ బుజ్జిబాబు ఉన్నారు.

సాంకేతిక లోపాలను సరిచేయాలి

ప్రజాశక్తి - పొందూరు

పాఠశాలల పున:నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలు, మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న సాంకేతిక లోపాలను సవరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పిల్లలవలస ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ కింతలి బేసిక్ ప్రాథమిక పాఠశాలలో 11మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ కేవలం ఇద్దరు పేర్లు మాత్రమే ఆన్‌లైన్ హాజరులో చూపిస్తున్నాయని తెలిపారు. ఈ కింతలి ప్రాథమిక పాఠశాలను కనిమెట్ట మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేశారని, రెండు పాఠశాలలు ప్రస్తుతానికి 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు బేసిక్ ప్రాథమిక పాఠశాలలగానే కొనసాగుతున్నప్పటికీ కింతలి పాఠశాలకు సంబంధించిన లీప్ యాప్‌లో 3,4,5 తరగతుల విద్యార్థుల పేర్లు గల్లంతయ్యాయని, వీరి పేర్లు ఈ రెండు పాఠశాలల్లో ఎక్కడా కనిపించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇదే మండలంలోని కోటిపల్లి ప్రాథమిక పాఠశాలను మజ్జిలపేటలో విలీనం చేసినప్పటికీ కోటిపల్లి విద్యార్థులు మజ్జిలపేట పాఠశాలకు వెళ్లకుండా అదే పాఠశాలలో కొనసాగుతున్నారు. అయితే వీరి హాజరు మజ్జిలపేట మోడల్ ప్రాథమిక పాఠశాలలో వేస్తున్నారని తెలిపారు. ఈ విధమైన సాంకేతిక లోపాల వల్ల మధ్యాహ్న భోజనానికి సంబంధించి గుడ్లు, రాగిజావ, చిక్కీ తదితర అంశాల్లో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విధమైన సమస్యలు మండలంలోని వావిలపల్లిపేట, వి.ఆర్.గూడెం, భగవాన్ దాసుపేట, కేశవదాసుపురం వంటి పాఠశాలలతో పాటు జిల్లాలో చాలా పాఠశాలల్లో ఈ విధమైన సమస్యలు ఉన్నాయని, వాటిని మండల, జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఒపిఒలుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయడంలో పొందూరు ఎంఇఒలు డ్యూటీ సర్టిఫికెట్‌లను ఇప్పుడు తేవాలని కొర్రీలు పెట్టి ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదని అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన డిఎ బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు తమ్మినైన మురళి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బలివాడ వెంకటేశ్వర్లు, గురుగుబెల్లి భాస్కరరావు, గండెం రామారావు, బగాతి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసన్న



ఫిర్యాదు కాపీలను చూపిస్తున్న డ్వాక్రా మహిళలు

డ్వాక్రా డబ్బుల స్వాహాపై ఫిర్యాదు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో సంతపేటలో మహిళా సంఘ అధ్యక్షులు బ్యాంకు నుంచి తెచ్చుకున్న రూ.ఏడు లక్షల వరకు స్వాహా చేశారని సభ్యులు గురువారం పట్టణ పోలీసులకు తెలిపారు. డ్వాక్రా సంఘ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 17 వార్డుకు చెందిన భువనేశ్వరి గ్రూప్ లీడర్ కర్రి కృష్ణవేణి డ్వాక్రా గ్రూపు మొత్తం రూ.15 లక్షలు గతేడాది జనవరి నెలలో సభ్యులందరూ లోన్ తీసుకున్నారు. అప్పటి నుంచి గ్రూప్ సభ్యులందరూ బ్యాంకుకు చెల్లించాల్సిన లోన్ డబ్బులు ఆమెకు ఇచ్చేవారు. అయితే కృష్ణవేణి 9 నెలల పాటు బ్యాంకులో లోను సొమ్ము కట్టలేదు. గ్రూప్ సభ్యులు బ్యాంకులో చేసుకున్న పొదుపు సొమ్ము రూ.2,74,500 కూడా బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసింది. అక్కడికి 9 నెలలు అనంతరం ఈ విషయం తెలుసుకున్న గ్రూప్ సభ్యులు లీడర్‌ను నిలదీశారు. ఈ ఏడాది జూలైలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఆమె భర్త నాగరాజు డబ్బులు చెల్లిస్తామని పోలీసుల వద్ద అంగీకరించాడు. అయినా ఇప్పటికీ లోన్, పొదుపు సొమ్ములు కట్టలేదు. ఇదే విషయం నాగరాజును అడగ్గా... అప్పు కట్టనని, మీకు దిక్కున చోటు చెప్పుకోండని తెగేసి చెప్పాడు. దీంతో బాధిత సభ్యులు గురువారం ఎస్ఐ ముకుందరావుకు ఫిర్యాదు చేశారు.

ప్రకాష్ వర్ధంతి

కవిటి: ఉద్దానం ప్రజల ఆప్తుడు, కవిటి మాజీ ఎంపిపి, ఆంధ్రాబ్యాంకు మాజీ డైరెక్టర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తండ్రి బెందాళం ప్రకాష్ ఐదో వర్ధంతి ప్రగడపుట్టుకలో ఘనంగా నిర్వహించారు. గ్రామ క్రీడా ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామస్తులు నివాళ్లర్పించారు. అనంతరం ఆయన ఇంటి వద్ద గల ఘాటుకు వెళ్లి పుష్పాంజలి సమర్పించారు. ఈ యువజన సంఘ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వం


ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారదిలా నిలిచే పత్రికా విలేకరుల పత్రికా స్వేచ్ఛను హరించడం కూటమి ప్రభుత్వానికి తగదని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. గురువారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులపై దాడి దుర్మార్గమని, ప్రశ్నించే హక్కు మీడియాకు ఉందన్నారు. నిజాలను నిర్భయంగా ప్రచురించే పత్రికలను అణచివేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని, జర్నలిస్టులపై అక్రమ కేసులను మానుకోవాలన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తూ నిజాలను నిర్భయంగా ప్రచురించే సాక్షి పత్రిక యాజమాన్యం, జర్నలిస్టులపై దాడులు, వేధించడం మానుకోవాలన్నారు. మీడియా స్వేచ్ఛను హరించే హక్కు కూటమి ప్రభుత్వానికి లేదని, రాజ్యాంగ విరుద్ధమైన చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పన్నారు. ప్రశ్నించే గొంతును అణచివేసే ప్రభుత్వాలు ఎంతకాలం నిలవలేవని హెచ్చరించారు. మాజీ సిఎం జగన్ పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఒక్క మెడికల్ కళాశాలైనా తీసుకురాలేదని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడాన్ని ప్రజలు సహించరని, రానున్న కాలంలో ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని గోవిందరావు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న గోవిందరావు

ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు



పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. పలాస స్వచ్ఛతా సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి జీడి పిక్క బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలు వస్తాయన్నారు. సింగిల్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తామని చెప్పారు. ప్లాస్టిక్ లేని సమాజానికి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రెటరీలు, శానిటేషన్ సూపర్‌వైజర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్వచ్ఛహీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్ వ్యాపారులకు అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, ఉప్పాడ తుల సయ్య, ముప్పన గవరయ్య, హేమాకుమార్ పాల్గొన్నారు.

సోంపేట : స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పట్టణంలో మండల అధికారులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గాంధీ మండపం వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలస్వామి, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటరావు, ఇఒ ఎం.శాంతకుమారి పాల్గొన్నారు.



ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైసిపి నాయకులు

ధర్మానను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు గురువారం పెద్దపాడులో ఉన్న తన కార్యాలయంలో వైసిపి ఎస్‌సి విభాగం వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ వైసిపి ఎస్‌సి విభాగ జిల్లా అధ్యక్షులు ముంజేటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఎస్‌సి విభాగం విస్తృతస్థాయి సమావేశం విజయవంత మైందన్నారు. అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి విభాగం కార్యదర్శి పొన్నాడ రుషి, ఎస్‌సి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యిల లక్ష్మణరావు, నియోజకవర్గ ఎస్‌సి విభాగం ఇన్‌ఛార్జి యజ్జల గురుమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి నీలపు ముకుంధరావు, జిల్లా ఉపాధ్యక్షులు సతివాడ రామినాయుడు, నర్సన్నపేట ఎస్‌సి సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, చింతల గడ్డియ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - రణస్థలం

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలని పోలీసు సిబ్బంది కె.శంకరరావు, పి.కుమార్‌బాబు, ఉమెన్ కానిస్టేబుల్ రామలక్ష్మి అన్నారు. మండలంలోని మరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లలకు అవగాహన లేక తల్లిదం డ్రులు 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు బాల్యవివాహాలు చేస్తున్నారన్నారు. ఇది చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నా కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను బాల కార్మికులుగా మారుస్తున్నారన్నారు. బాలలందరూ చదువుకొని ఉన్నత స్థితికి రావాలని కోరారు. అలాగే మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.శివశంకర్, ఉపాధ్యాయులు షేక్ రహీం, టి.సురేష్, కె.ఖగేశ్వర రావు, బి.జి హరినాథ్, జి.చిన్నికృష్ణం నాయుడు, వై.ప్రమీల, పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రామ్‌మనోహర్ పరామర్శ

శ్రీకాకుళం రూరల్: మండలంలోని తండెంవలసలో ఇటీవల మృతి చెందిన పొదలాపు రాము కుటుంబాన్ని గురువారం వైసిపి యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు పరామర్శించారు. తండెంవలస పంచాయతీ బెండువానిపేటలో కింజరాపు గంగరాజు ఇటీవలే ప్రమాదంలో అకాల మరణం చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా బైరివానిపేటలో పొన్నాన రామారావుకు ఇటీవలే కంటి ఆపరేషన్ జరిగిందని తెలుసుకొని ఆయనను పరాపర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పొన్నాన కుర్మారావు, గొద్దు చిరంజీవి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



శైలజను సన్మానిస్తున్న కార్యదర్శులు

శైలజకు సన్మానం

పలాస : మండల పరిషత్ కార్యాలయంలో డిడిఒగా బొడ్డేపల్లి శైలజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కార్యదర్శులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

శుద్ధజలం వితరణ

నందిగాం : మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రోజూ అవసరమైన శుద్ధజలాన్ని ఉచితంగా అందించేందుకు గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గురువారం శుద్ధజలాలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెలికాని వెంకటరమ ణకు అందించారు. గ్రామానికి చెందిన చమళ్ల చిట్టిబాబు, జి.ప్రకాశరావు, ఆర్.రాజు, అప్పారావు తదితరులు సౌజన్యంతో రోజుకు వంద లీటర్ల శుద్ధజలాన్ని అందించనున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు బొడ్డేపల్లి శేషగిరి, అమిన్, తాతారావు, రమేష్, జయరాం తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

పలాస : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు అవసరమని సాయి కాలనీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.కళ్యాణి అన్నారు. ఇటీవల వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన డివిజన్‌స్థాయి క్రీడా పోటీల్లో ఎంపికైన పాఠశాలకు చెందిన విద్యార్థులకు గురువారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అండర్-14 చెస్ విభాగంలో ఏడో తరగతి చదువుతున్న జి.శ్రీనిధి, ఆరో తరగతి, చదువుతున్న ఎల్.దివ్య, బ్యాడ్మింటన్ అండర్-14లో 8వ తరగతి చదువుతున్న వి.వంశి, ఖోఖో విభాగంలో ఆరో తరగతి చదువుతున్న ఆర్.ధర్మేంద్ర, పలాస డివిజన్ స్థాయి క్రీడలో పాల్గొనేందుకు అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ వరలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్.ఆర్.రాంజీ, తిరుమల, ఉపాధ్యాయ పాల్గొన్నారు.



మెమోంటో అందజేస్తున్న హెచ్ఎం కళ్యాణి

వలస మత్స్యకారుల ఉదారత



ఆర్థికసాయం అందిస్తున్న వలస మత్స్యకారులు

ప్రజాశక్తి - కవిటి

మనిషికి ఏ కష్టమొచ్చినా ముందుగా అండగా నిలిచేది కుటుంబం. కానీ సమాజంలో కష్టకాలంలో తోటి మనుషులే నిజమైన బంధువులుగా మారుతారు. మండలంలోని పెద్దకపాసుకుద్దికు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన జనసైనికుడు కర్రి మేఘనాథంకు అండమాన్‌లో నివసిస్తున్న వలస మత్స్యకారుల నుంచి అలాంటి అండ లభించింది. జూలై 24న సంభవించిన రోడ్డు ప్రమాదంలో మేఘనాథం తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శస్త్రచికిత్స కోసం దాదాపు రూ.10 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలిసి అండమాన్ దీవుల్లో నివసిస్తున్న తమ ఊరి మత్స్యకారులు ముందుకు వచ్చారు. వారి హృదయాల్లో ఉప్పొంగిన మానవత్వం డబ్బు రూపంలో కరిగి రూ.2,48,800గా గుమికూడింది. గురువారం ఈ మొత్తాన్ని గ్రామ సంఘ పెద్దల చేతుల మీదుగా మేఘనాథం కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధికారి బడే రామారావు, సంఘ అధ్యక్షుడు బడే తాతారావు, పాండవ తారకేశ్వరరావు, దశ తిరునాథ, బడే దేవరాజు, బడే డిల్లేష్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలోనే దళితులకు న్యాయం

కోటబొమ్మాళి: దళితలకు మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే న్యాయం జరిగిందని వైసిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు కాళ్ల గణపతిరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వైసిపి ఎస్‌సి విభాగం విస్తృతస్థాయి సమావేశానికి వచ్చిన ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.సుధాకర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. టిడిపి పాలనలో ఎటువంటి మార్పులు రావడం లేదని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి కల్చరల్ విభాగ అధ్యక్షుడు పొన్నాడ మురళీమోహన్, కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావు, కురుడు సర్పంచ్ కోతి చెన్నారావు, ఎంపిటిసి చుక్క లోకేష్, పంకు రాము, బోనెల ఎల్లయ్య, దండాసి సింహాచలం, మహేష్ పాల్గొన్నారు.



సుధాకర్‌బాబును కలిసిన దళిత సంఘ నాయకులు



అవగాహన కల్పిస్తున్న సిఐ చిన్నంనాయుడు

112కు డయల్ చేయాలి

ఇచ్ఛాపురం: యుక్త వయసులో ఉన్న విద్యార్థినులు ప్రేమ, ఆకర్షణల మధ్య తేడాను గుర్తించాలని సిఐ ఎం.చిన్నాంనాయుడు సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నారీశక్తిలో భాగంగా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో, బయట, ప్రయాణలో ఇలా ఎక్కడైనా ఆపదలో ఉంటే వెంటనే 112కు డయలు చేయాలన్నారు. వివరాలు చెవితే సమీప పోలీసులు మీకు సహాయం అందిస్తారని అన్నారు. ఓచేందుకు సిద్దంగా ఉంటారన్నరు. ఇంటి నుంచి కళాశాలకు రాకపోకలు సాగించే సమయాల్లో ఆటోలు, బస్సులు, ఇతర చోట్ల ఎక్కడ ఈవ్ టీజింగ్ జరిగినా వెంటన్ సమాచారం ఇస్తే ఆకతాయిల భరతం పడతామన్నారు. అలాగే చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని పేర్కొన్నారు. అందుకు ప్రణాళికాబద్ధంగా చవుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవ్యశ్రీమహంతి, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రజనీకుమారి, అధ్యాపకులు బి.సునీత, శాంతిశ్రీ, లత, సుధాకర్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్ 2 ఉచిత పాఠ్యపుస్తకాలు మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్నాయని ఎంఇఒలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం గురువారం 35 వేల పుస్తకాలు రావాల్సి ఉండగా, మొదటి, రెండు విడదల సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు 17,064 వచ్చాయని అన్నారు. వీటిని కార్యాలయంలో భద్రపపరిచామన్నారు. శుక్రవారం నుంచి సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్ఎంటి అర్.దేవరాజు, కె.సోమేశ్వరరావు, సిహెచ్.మోహనరావు, సత్యనారాయణ, అర్.తులసీరావు, బి.గణేష్, ఆశి రవికుమార్‌రెడ్డి, డిటిఇఒ ఉప్పాడ కామేష్, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌ను వినియోగించుకోవాలని మహిళా కళాశాల ప్రిన్సిపల్ డా. కె సూర్యచంద్రరావు అన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగాలు, డిఎంహెచ్ఒ, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఆరోగ్యపరంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహిళలు నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మావతికి డాక్టరేట్

ప్రభుత్వ మహిళా కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు ఎస్ పద్మావతికి విశాఖపట్నానికి చెందిన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డాక్టరేట్‌ను ప్రసాదించినట్లు ప్రిన్సిపాల్ డా కె సూర్యచంద్రరావు తెలిపారు. 'కాంప్రెహెన్సివ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ హైడ్రోజన్ బాండెడ్ లిక్విడ్ క్రిస్టల్స్' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

కోటబొమ్మాళి : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లోగొండు నారాయణరావు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రణభేరి జాతాలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణలో భాగంగా గురువారం మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలన్నారు. బకాయి పడిన డిఎలను తక్షణమే విడుదల చేయాలన్నారు. బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలన్నారు. హెల్త్ కార్డు ఉన్న ఉద్యోగులందరికీ జాప్యం లేకుండా వైద్యం చేయాలన్నారు. పెన్షనర్ల బకాయిలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాసుదేవరావు, మన్మథరావు, తవిటమ్మ, నీలకంఠేశ్వరరావు ఆదినారాయణ, రమణమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు నారాయణరావు

'అభయహస్తం' లబ్ధిదారుల ఆందోళన

జలుమూరు: డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు ప్రవేశపెట్టిన పథకం అభయ హస్తం పథకం ఇప్పుడు నిర్వీర్యమవుతోందని టిడిపి కుటుంబ సాధికార సారథి కొండకు ఆదేశ్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. 15 ఏళ్ల క్రితం ఈ పథకం అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న మహిళలు నెలకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రీమియం చెల్లిస్తే... 60 ఏళ్లు వచ్చిన వెంటనే పింఛను అర్హులుని అన్నారు. గత 15 ఏళ్ల నుంచి లబ్ధిదారులు ప్రీమియం చెల్లించారని తెలిపారు. గతకొద్ది నెలల నుంచి ప్రీమియం కట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో డ్వాక్రా సంఘాల లబ్ధిదారులు లబోదిబోమంటున్నారని తెలిపారు. ఇప్పటి వరకు చెల్లించిన ప్రీమియం డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని అభయ హస్తం లబ్ధిదారులు కోరుతున్నారని తెలిపారు.

'సూర్యఘర్' రాయితీ చెల్లించాలి

పిఎం సూర్యఘర్ సోలార్ ఏర్పాటు చేసుకున్న బిసిలకు రాష్ట్రం ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలు ఇస్తామని రాయితీని తక్షణమే విడుదల చేయాలని కోరుతున్నారు. సూర్య ఘర్ సోలార్ ఏర్పాటు చేసుకొని ఆరు నెలలు అవుతుందన్నారు. ఇప్పటి వరకు రాయితీ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రాయితీని జమ చేయాలని కోరుతున్నారు.



జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు

జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక

ప్రజాశక్తి - టెక్కలి

స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో, మహాత్మాజ్యోతీభాపూల్ బాలికల పాఠశాల, ఆదిఆంధ్రా వీది వద్ద ఉన్న ఆశ్రమ గిరిజన పాఠశాల ఆవరణల్లో గురువారం డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడల్లో భాగంగా వాలీబాల్, చదరంగం, వంటి క్రీడలు నిర్వహించారు. డివిజన్‌లోని 69 పాఠశాలల నుంచి సుమారు 580 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డివిజన్ క్రీడా ఇన్‌ఛార్జి బాడాన నారాయణరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ క్రీడలను ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ తెంబురు గోవిందమ్మ, సిహెచ్.నందీశ్వరరావు, పి.సుధారాణిలు పర్యవేక్షించారు. డివిజన్ క్రీడా పోటీల్లో ఎంపికైన వారు జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొంటారని నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.కృష్ణారావు, వై.శేఖర్‌బాబు, జనార్ధనరావు, డి.వి.రమణయ్య, హేమలత, జె.కృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని అల్లెనలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 47 మందికి రక్తపోటు, మధుమేహం పరీక్షలతో పాటు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ సర్పంచ్ జడ్డు మహేశ్వరరావు, వైద్య సిబ్బంది సిహెచ్ఒ అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌సి, ఎఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమశాఖ ద్వారా నిర్వహిస్తున్న స్వశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరంలో వైద్యాధికారులు లేకుండా కేవలం సిబ్బందితోనే ఈ శిబిరాన్ని నిర్వహించడం ఏమిటని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఆమదాలవలస : స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మెట్టక్కివలసలోని సచివాలయం -1 పరిధిలో 10, 11వ వార్డుల మహిళలకు వైద్యాధికారి సాయి కృష్ణ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. .ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి యువజన సంఘం ప్రధాన కార్యదర్శి, జిల్లా టిడిపి సాధికారిత కమిటీ సభ్యుడు నాగళ్ల మురళీధర్ యాదవ్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన వచ్చిందిన డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణబాబు ఈ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యులు దేవేంద్రరెడ్డి, అనూష, గౌతమి, శిల్ప, నీలిమ, నిర్మల అలెక్షెండర్, శ్రీకాంత్ రమేష్‌నాయులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి రాజు, బుద్దాల నిర్మలారెడ్డి, పత్రి తవిటియ్య, కాళ్ల దిలీప్, కొండ శంకర్‌రెడ్డి, నందిక జాని, కాళ్ల జయదేవ్, జన్నెల సంతోష్, కృష్ణయ్య, ఎస్.శేఖర్, వి.కె.ప్రసాద్ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : రోగులతో మాట్లాడుతున్న కూటమి నాయకులు